# ఉత్తరం

-సిహెచ్.కల్పన

"పోస్ట్...పోస్ట్..." పోస్ట్‌మాన్ పిలవడంతో చేస్తున్న పని ఆపి బయటకు వచ్చి ఆ ఉత్తరం అందుకున్నాను.

దాని మీద 'సభాహా, కోమిల్లా జిల్లా, బెంగాల్' అని రాసి వుంది. నేను అనుకుంటూనే వున్నాను. ఈనెల ఇంకా అక్కడ నుండి లెటర్ రాలేదేంటానని. సరిగ్గా ఈ రోజే వచ్చింది.

వెంటనే ఆ ఉత్తరాన్ని తీసుకుని నాన్నకి ఇవ్వడానికి ఆయన గదిలోకి వెళ్లాను. ఆయన కిటికీలో నుండి పోస్ట్‌మాన్ లెటర్ ఇవ్వడం చూసినట్టున్నారు. ఎందుకంటే అప్పటికే నాకోసం ఆయన గుమ్మంవైపు చూస్తున్నారు. ఆయన కళ్ళు తదేకంగా నా చేతిలోని ఉత్తరాన్ని చూస్తున్నాయి.

ఆ కళ్లల్లో సంతోషం, బాధ మాత్రమేకాక, నీ కోసమే సుమా నా ఎదురుచూపులు అన్నట్లుగా ఉన్నాయి. నేను ఉత్తరం చేతికిచ్చాను. ఆయన చేతిలో అడ్డంగా ఒక గీత కన్పించింది. నాకు ఊహ తెలిసినప్పటినుంచీ అది ఆయన చేతి మీద వున్నది.

ఎన్నోసార్లు అడిగాను "ఏమిటి నాన్నా ఆ గీత?" అని.

కానీ ఆయన గంభీరంగా "ఏమోరా! నాకు తెలియదు" అని చెప్పేవారు.

నాన్నతో నేను చాలా సరదాగా వుంటాను. కానీ ఆయన ముఖంలో గాంభీర్యం కనిపిస్తే నా గొంతులో చిలిపిదనం, నా ముఖంలో నవ్వు కాగడా పెట్టి వెదికినా కన్పించవు. అందుకని ఊరకుండిపోయాను. కానీ నాకు ఈ లెటర్ విషయమేమిటో తెలుసుకోవాలనిపించింది. సరిగ్గా ప్రతినెలా తొమ్మిదవ తేదీన బెంగాల్ నుండి లెటర్ వస్తుంది! ఎందుకో ఈ లెటర్ గురించి తెలుసుకోవాలని ఈసారి బాగా అనిపించింది.

వెంటనే అమ్మకోసం లోపలికి వెళ్లాను. వేసవి కాలం కావడంవల్ల ఇంకా చీకటి పడలేదు. సూర్యుడు అప్పుడే అస్తమించబోతున్నాడు.

ఆ నీరెండలో అమ్మ రోట్లో కొబ్బరి పచ్చడి నూరుతోంది. ఎందుకో ఆ సమయంలో అమ్మను చూసేసరికి మనస్సులో చిత్రమైన అనుభూతి ఎంతో హాయిగా అన్పించింది.

అయితే అమ్మ అప్పుడప్పుడు మాత్రం పరధ్యానంగా వుంటుంది. నుదుట పావలా అంత బొట్టు పెట్టి మధ్య పాపిడీ తీసి జుట్టు వెనక్కి దువ్వి ముడివేస్తుంది.

ఆ నుదుటినే కాక పాపిట్లో కూడా బొట్టు ఎప్పుడూ వుంటుంది. ముత్తయిదువ అంటే మా అమ్మే నిర్వచనంలా అన్పిస్తుంది.

"అమ్మా!" అంటూ దగ్గరకెళ్లాను.

"ఏంటీ! నీ గొంతులో పిలుపు మారింది. దేని గురించి అడగాలనుకుంటున్నావు నిఖిల్?" అంటూ అమ్మ నా ఆలోచనలను కనిపెట్టినట్టు అడిగింది.

"ఏంలేదమ్మా. నాన్నకి ప్రతినెలా బెంగాల్ నుండి ఉత్తరం వస్తుంది కదా. కరెక్టుగా ఒకే తారీకున వస్తుంది కదా. దాని గురించి నాకు చెప్పవూ" అని అడిగాను.

"ఏమోరా! నాకు ఈ విషయం మీద అంత శ్రద్ధ లేదు. అందుకనే నేను మీ నాన్నను ఎప్పుడూ దీని గురించి అడగలేదు. ఆ సంగతి నాకు తెలియదు. అయినా ఆ విషయం నీకెందుకు?" అని అంది.

ఎందుకనో నాకు నమ్మబుద్ధికాలేదు.

కానీ నేను ఏమీ చేయలేనని తెలిసి ఇవతలికి వచ్చేసాను.

తరువాత రెండురోజులకే నాన్న హడావుడిగా బెంగాల్ ప్రయాణమయ్యారు.

నాకు అవకాశం వచ్చినట్లు అనిపించి 'నాన్నా! అంత దూరం మీరు ఒక్కరే ఎందుకు? నన్నూ రమ్మంటారా?" అని అడిగాను.

"అవసరంలేదు నిఖీ. ఏమంత భయంలేదులే. నేను వెళ్లొస్తాను" అని చెప్పి వెళ్లిపోయారు.

***

'నాన్న వెళ్లి నాలుగురోజులు కావస్తోంది. ఇంత వరకూ ఫోన్ కూడా చేయలేదు. ఏంటో ఈయన?' అని అనుకున్నాను.

మధ్యాహ్నం అన్నం తిని ఉద్యోగానికి అప్లికేషన్ పోస్ట్ చేసి వచ్చాను. అవును మరి డిగ్రీ అయిందికదా. ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టాలి.

ఇంట్లోకి వచ్చానో లేదో ఫోన్ మోగింది.

రిసీవర్ ఎత్తి హలో అన్నాను.

అవతలి వైపు నుంచి వచ్చిన సమాధానం విని నా మతిపోయింది.

విషయం ఏమిటంటే నాన్నగారికి యాక్సిడెంట్ అయిందనీ, దెబ్బలు తగిలాయనీ, హాస్పిటల్‌లో చేర్పించామనీ, కోలుకుంటున్నారనీ రెండు మూడురోజుల్లో బయలుదేరుతున్నామని చెప్పారు. ఆ తరువాత అమ్మకి ఈ విషయం చెప్పాను. అమ్మ మౌనంగా ఏడుస్తోందే తప్ప అక్కడి విషయాల గురించి చెప్పమంటే చెప్పడం లేదు.

***

నాన్న వచ్చి వారంరోజులవుతోంది. ఇప్పటికి కాస్త కులాసా చిక్కింది. నాన్న నన్ను పిలిచి బెంగాల్ అడ్రస్ ఇచ్చి 'నేను బాగానే వున్నాను' అని కబురు చేయమన్నారు.

వారంరోజులనుంచీ సహనంతో వున్న నేను ఆ రోజు నా కోపాన్ని ఆపుకోలేకపోయాను. వెంటనే నాన్నతో చెప్పాను.

"నేను చేయను ఆ పని?" అన్నాను.

"ఏం... ఎందుకు?" అడిగారు నాన్న.

"ఎందుకంటే ముందునాకు మీరు బెంగాల్ ఎందుకెళ్లారో, అక్కడి నుంచి మీకు లెటర్స్ ఎందుకు వస్తున్నాయో నాకు ఖచ్చితంగా తెలియాలి. అదీ ఈ రోజే" అంటూ మొండి పట్టుదల పట్టాను.


నాన్న చిన్నగా నిట్టూర్పు విడిచారు.

"నాకు తెలుసు నిఖీ! నేను నీకు ఈ విషయం గురించి చెప్పాల్సిన సందర్భం వస్తుందని. నీకు తెలుసా నువ్వు పుట్టింది బెంగాల్‌లోనేనని. అంతే కాదు అసలు మన పూర్వీకులది బెంగాలీ. మనం ఇక్కడికి వలస వచ్చాం. అదీ బాబ్రీ మసీదు కూల్చివేతవల్లే"

"ఏంటీ! బాబ్రీ మసీదు కూల్చివేతవల్ల మనం వలస వచ్చామా? నిజంగానా?" నిఖిల్‌కి నోట మాట రాలేదు.

"అవును నిఖీ. మనం బెంగాల్‌లోని కోమియా జిల్లాలో సభాహ్ అనే ఊళ్ళో వుండేవాళ్లం. అక్కడ మనకు సొంత ఇల్లు ఉండేది. ఒక భాగంలో మనం వుంటే రెండవ భాగంలో ఒక ముస్లిం కుటుంబం అద్దెకు ఉండేది. కొద్ది కాలంలోనే అతను నేను చాలా మంచి స్నేహితులమయ్యాము. అయితే ఆ స్నేహం బాబ్రీ మసీదుతోపాటే కూలిపోయింది. ఆ రోజు ఇప్పటికీ నాకు గుర్తే.

అది 1992వ సంవత్సరం. డిసెంబర్ తొమ్మిదవ తారీకు. మసీదు కూలి అప్పటికి నాలుగురోజులైంది. నేను ఉదయం పది గంటల సమయంలో రేడియో పెట్టుకుని వింటున్నాం. అప్పటికే అక్కడి ప్రాంతాలు గొడవలతో, దారుణాలతో అట్టుడికిపోతున్నాయి. ఏ ఒక్క హిందువుకనిపించినా 'చంపండి, నరకండి' అంటూ ముస్లింలు హిందువుల్ని చాలా దారుణంగా నరికి చంపేసారు. ఆ రోజు మీ అక్క వసుంధర పుట్టినరోజు. అప్పుడు నీకు ఐదేళ్లు"



"ఏంటీ అక్కా? నాకా? నిజంగానా? నాకు ఇప్పటివరకూ ఎందుకు చెప్ప లేదు? నాకు తోడబుట్టిన అక్క ఉందని ఎందుకు చెప్పలేదు? ఈ రహస్యాన్ని ఎందుకు దాచారు?'' ఆశ్చర్యంతో ప్రశ్నించాను.

"ఆవేశపడకు నిఖిల్. నేను చెప్పేది శాంతంగా విను. మీ అక్క బాధపడకూ డదని మీ అమ్మ ఆ రోజు పాయసం చేసింది. ఆ సంవత్సరంతో పదవతరగతి పూర్తి చేసింది తను. అందుకని మళ్లీ తన ఉపాధ్యాయులని చూసే అవకాశం ఉండదని, మేము ఎంత చెప్పినా వినకుండా వెళ్లింది. పక్క వీధే కావడంతో మేము గట్టిగా వద్దని చెప్పలేదు. మీ అక్క అటు వెళ్లిన ఐదునిముషాలకే కొంత మంది బలవంతంగా ఇంట్లో చొరబడి ఇల్లంతా ధ్వంసం చేసి బలవంతంగా ఆస్తి రాయించుకుని వెళ్లారు. ఆ సమయంలో వసుంధర ఇంట్లోలేదు. ఆ దుండగులు ఏ ఆడపిల్ల కనిపించినా వాళ్లని బలవంతంగా ఎత్తుకెళ్లేవారు. అయితే వసుంధర సాయంత్రం వరకూ ఇంటికి రాలేదు. ఇక లాభంలేదని వసుంధరను తీసుకురావాలని బయటకు బయలుదేరాను. వీధి చివరివరకు వచ్చానోలేదో అక్కడి దృశ్యం చూసి నిశ్చేష్టుణ్ని అయ్యాను. కలలోనైనా ఊహించని దృశ్యం. అక్కడో అమ్మాయి రక్తం మడుగులో పడివుంది. శరీరం నిండా కత్తిపోట్లు. కడుపులోని పేగులు బయటకు వేలాడుతున్నాయి. ఆ అమ్మాయి కుడిచేతికి రెండువేళ్ళు లేవు. అవి నరకబడ్డాయి. కానీ ఆ అమ్మాయి జేబులోంచి రెండు చాక్లెట్లు బయటకు కన్పిస్తున్నాయి. ఆ అమ్మాయి ఎవరో కాదు మీ అక్క. నాకు నోట మాట రాలేదు. ఎవరో నా భుజం తట్టడంతో పక్కకు తిరిగి చూసాను. నా బాల్యమిత్రుడు రషీద్.

"ఏంటి నువ్వు ఇలా బయటకు రావడం ఎంత ప్రమాదకరమో తెలుసా? ఎందుకొచ్చావ్?'' అంటూ పక్కనున్న దృశ్యం చూసి "ఏంటిరా ఆ అమ్మాయి వసుంధర కదూ. ఏమిత్రా ఇది?'' నన్ను పట్టుకుని కుదిపేసాడు.

"అప్పటికిగానీ నాకు తెలియదు కన్నీళ్ళు కార్చాలని. తరువాత ఏం జరి గిందో తెలియదు. అంతా రషీదే చూసాడు. అతనే మనల్ని ఇక్కడకు పంపిం చాడు. దీనికంతటికీ కారణం బాబ్రీ మసీదు. నిజమే హిందువులే దాన్ని నాశనం చేసారు. కానీ ఇతర ప్రాంతాల్లో వున్న హిందువులకి దీనితో సంబంధం ఏమిటి? ఎంతమంది హిందువులు తమ మాన, ప్రాణాలను పోగొట్టుకున్నారు. ఎంతమంది భార్యాపిల్లలను పోగొట్టుకున్నారు. ఎంతమంది అవిటివార య్యారు? వారి గురించి ఎవ్వరైనా పట్టించుకున్నారా? అయితే ఇన్ని దారుణ మారణకాండలకు ముస్లింలు మాత్రమే కారణం కాదు. దీనివల్ల వారు కూడా నష్టపోయారన్నది నిజం. కిరాయి గూండాలు, రౌడీలు ఇదే అవకాశంగా విజృంభించారు. హిందువు పేరుతో వున్న ఇంటినీ, దుకాణాలను తమ ప్రయో జనాలకోసం లూటీ చేసి తరువాత నాశనం చేసేవారు. ఇక్కడకు వచ్చిన తరు వాత చాలాకాలం వరకు వసుంధరను మర్చిపోలేకపోయాం. ఆ సమయంలో మీ అమ్మ ఎంతో ధైర్యంతో, నిబ్బరంతో నిన్నూ, నన్నూ చాలా జాగ్రత్తగా చూసుకుంది. నా చేతిలోని గీత అక్కడి దారుణానికి ప్రత్యక్ష సాక్ష్యం. ఇప్పుడు తెలిసిందా నిఖిల్! గతం ఎంత ఘోరమైనదో! ఇంతకాలం నువ్వు చిన్నవాడివి. అందుకే నీకు చెప్పలేదు. ఇప్పుడు నీకు అర్థం చేసుకోగలిగిన వయస్సు వచ్చింది. ఇక్కడికి వచ్చిన తరువాత రెండు సంవత్సరాలవరకూ నేను మళ్లీ బెంగాల్‌కు వెళ్లి రషీద్‌ను కలిసాను. ఆశ్రయం కోల్పోయి అనాథలైన వారిని చాలామందిని చూసాను. వారి కోసం ఏదైనా చేయాలన్పించింది. రషీద్ సహ కారంతో అక్కడ చిన్న ఆశ్రమంలాంటిది స్థాపించి అనాథలకు మాకు చేతనైన సాయం అందజేస్తున్నాం. ఆ అనాథాశ్రమం మీ అక్క పేరుతో ఉంది. ప్రతినెలా నా జీతంలో కొంత భాగాన్ని అక్కడకు పంపిస్తున్నాను. ప్రతినెలా వచ్చే ఉత్త రాలు అక్కడినుండే. అక్కడ ఆశ్రయం పొందిన వారు నన్ను తమ ఆపుడిలాగా భావించి నన్ను దీవిస్తూ వాళ్ల కష్టసుఖాలు నాతో పంచుకుంటారు. అందుకే ఆ ఉత్తరాలంటే నాకు అంత ప్రాణం''

నాన్న చెప్పడం ఆపి నావైపు చూసారు. దగ్గరకు వచ్చి నా కళ్ళు తుడిచి ఆప్యాయంగా భుజంమీద చేయి వేసారు. నా కళ్లవెంట ఎప్పటి నుండి నీళ్ళు కారుతున్నాయో! ఇది జరిగిన తరువాత ఈ సంగతినే కథగా రాయాలనిపించి నాన్నని ఇంకా కొన్ని వివరాలు చెప్పమన్నాను.

"ఒరేయ్ నిఖీ! ఈ బాబ్రీ మసీదు గురించి కథలు, వ్యాసాలు, నవలలు ఎన్నో అచ్చయినాయి. ఇప్పుడు నువ్వు కొత్తగా రాయడం ఎందుకు? పైగా దీని గురించి ఎవరో కొంతమందికి తప్ప చాలామందికి గుర్తు ఉండదుకూ డాను''

"మీరు చెప్పింది నిజమే కావచ్చు నాన్నా. కానీ ఒకరు ఒక దృష్టితో చూస్తే ఇంకొకరు వేరే రకంగా చూడవచ్చు. కాబట్టి నేను మీరు అనుభవించిన వాటినే కథగా రాద్దాం అనుకుంటున్నాను''

"సరే ఇది నీకో కొత్త అనుభవం'' అన్నారు నాన్న నా భుజం మీద తడుతూ.

★



## ఆశాజనకం

ఎక్స్‌పోజింగ్‌తో జనం ముందుకి వచ్చి మంచి ఇమేజ్‌ని తెచ్చిపెట్టుకుంటుం టారు తారలు. "హాట్ సీన్స్‌లో నటించడం కొంచెం కష్టమే. అయితే ఆ కష్టానికి తగినట్టుగా కూడా మంచి ఇమేజ్ వచ్చి పడుతుంది. నేను ఎక్కువగా హాట్ సీన్స్‌లో నటిస్తున్నానన్న అపవాదు ఉంది. సినిమా కథకి తగ్గట్టుగా మన పాత్ర ఉంటుంది గానీ మనకి తగ్గ ట్టుగా సినిమా కథ ఉండదు కదా'' అంటోంది నేహాదు ఫియా. తన కెరీర్ ఎంతో ఆశాజ నకంగా ఉందని చెబుతోంది.

